క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఎంఆర్‌ఎఫ్ కాలనీలో రూ.20లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ పుష్ప నగేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బూరుగడ్డ నగేశ్, రామచంద్రారెడ్డి నగర్ కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా, జగన్నాథ్ రెడ్డి, వాసుదేవ్‌లు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణ ఏర్పాట్లను కార్పొరేటర్ పుష్ప నగేశ్ పరిశీలించారు.

గురుకుల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి


వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నారాయణఖేడ్: విద్యార్థులను కులవివక్షతకు గురిచేస్తున్న ఖేడ్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నల్లబెల్లి రమేశ్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు డిమాండ్ చేశారు. మెను పాటించకుండా ఉడికీ ఉడకని అన్నం, పల్చటి చారు, తగిన విధంగా మాంసాహారం పెట్టడంలేదని తెలిపారు. వంటగ్యాస్‌కు బదులుగా కట్టెల పొయ్యిపై వంట చేయిస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్వరాజ్, రాజేశ్, సంజీవరావు, నగేశ్, అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు, మహిళలకు ఆరోగ్యంపై అవగాహన

ఝరాసంగం(జహీరాబాద్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళను సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ సీడీపీఓ సునీత భాయీ సూచించారు. మంగళవారం ఝరాసంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ పక్వాడ నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థినులకు, మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య జీవన విధానంపై వారు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సునీత, డాక్టర్ రమ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఢమరుకం అందజేత

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డిలో హనుమాన్ మందిరానికి మంగళవారం ఎలక్ట్రిక్ ఢమరుకం అందజేశారు. గ్రామానికి చెందిన అప్పగారి చిన్న మల్లయ్య సత్యమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు లహరి, నగేశ్ దంపతులు రూ.18వేల ఢమరుకం సమకూర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు హన్మండ్లు సేట్, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


ప్రారంభిస్తున్న ఎంపీపీ, తదితరులు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తొంట యాదమ్మకిష్టయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెంకటాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కుమారుడు చింతా సాయినాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామ ప్రజలు కంటి పరీక్షలు చేయించుకొని, అవసరమైన వారికీ ఈ శిబిరంలో మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, సర్పంచ్ బాలమణి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న, ఉప సర్పంచ్ శంకర్, నాయకులు బాబూజీ, సుధాకర్, నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

బార్ సోసియేషన్ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్ రెడ్డి

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్ రెడ్డి వరుసగా ఏడోసారి ఎన్నికయ్యారు. జిల్లా కోర్టులో మంగళవారం జరిగిన ఎన్నికల్లో విష్ణువర్ధన్ రెడ్డి గెలుపొందారు. అనంతరం సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- 10కి10 జీపీఏ సాధన ధ్యేయంగా బోధన
- సందేహాలను నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయులు


పదోతరగతి ప్రత్యేక తరగతులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గత రెండేళ్లు కోవిడ్ కారణంగా పాఠశాలలు నామమాత్రంగా నడిచాయి. కోవిడ్ విజృంభించడంతో రెండు పర్యాయాలు ప్రభుత్వం పదోతరగతి పరీక్షలు నిర్వహించకుండానే విద్యార్థులందరినీ పాస్ చేసింది. ఈ విద్యా సంవత్సరం మాత్రం పాఠశాలలు పూర్తి స్థాయిలో కొనసాగాయి. ప్రధానంగా పదోతరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వారికీ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని సబ్జెక్టులు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తున్నారు.

పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం లక్ష్యంగా ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టితో పాటు 10కి10జీపీఏ సాధన లక్ష్యంగా బోధిన నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరు కాని విద్యార్థులను గుర్తించి సదరు విద్యార్థుల ఇంటికెళ్లి వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అదే మాదిరిగా నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వడానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూ.6లక్షలు విరాళం అందజేశారు. 2,150 మంది విద్యార్థులకు రూ.18లక్షల డిజిటల్ పుస్తకాలను పంపిణీ చేశారు. రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 556 మంది, పటాన్‌చెరు మండలంలో 696, అమీన్‌పూర్ మండలంలో 169 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు



పాఠశాల ముగిసిన తరువాత నిత్యం రెండు గంటలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఏదైన సందేహాలు ఉంటే అడిగి తెలుసుకుంటున్నాం.

సాయమ్మ, విద్యార్థిని, భెల్, జిల్లా పరిషత్ పాఠశాల

గణితం సులభమే



గణిత శాస్త్రం అంటే చాలామంది విద్యార్థుల్లో భయం ఉంటుంది. అన్ని సబ్జెక్టుల కన్నా గణితశాస్త్రం ఎంతో సులభం. పరీక్షలో వచ్చిన ప్రశ్నలను చదివి అర్థం చేసుకుంటే పాస్ మార్కులు రావడం ఖాయం.

శంకర్ బాబు, గణిత ఉపాధ్యాయులు, రామచంద్రాపురం

భయం పోగొట్టారు



పదోతరగతి పరీక్షలు అంటేనే భయం. అలాంటిది తమకు ఉన్న భయాన్ని ఉపాధ్యాయులు తొలగించారు. ఉత్తమ ఫలితాల కోసం తాము ఏ విధంగా చదవాలో ఉపాధ్యాయులు మాకు చెప్పారు.

నందిని, పదోతరగతి విద్యార్థిని, ప్రభుత్వ కస్తూర్బా పాఠశాల

మంచి మార్కులు సాధిస్తాం



పాఠశాలలో, ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులు బోధించిన అంశాలను శ్రద్ధగా విని చదువుకుంటున్నాం. మాకు ఏదైన సందేహం వచ్చిన వెంటనే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నాం. ఈ పరీక్షల్లో ఖచ్చితంగా మంచి మార్కులు సాధిస్తాం.

వివేక్, విద్యార్థి, భెల్, జిల్లా పరిషత్ పాఠశాల

పంట రుణాలు మంజూరు చేస్తాం


మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రైతులకు పంట రుణాలు మంజూరు చేస్తామని తెల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. తెల్లాపూర్ సహకార సంఘం అభివృద్ధికి సభ్యులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రతి సభ్యునికి పంట రుణాలు ఇచ్చేందుకు సొసైటీ సిద్ధంగా ఉందన్నారు. సభ్యులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవసాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చిట్టి, ఆత్మకమిటీ సభ్యులు యాదయ్య, సొసైటీ వైస్ చైర్మన్ మధు, డైరెక్టర్లు నాగిరెడ్డి, సునీల్, కుమ్మరి యాదయ్య, మోహన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, లచ్చ నాయక్ పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడడంలో సీపీఆర్ కీలకం


సీపీఆర్ ప్రక్రియపై అవగాహన పొందుతున్న పోలీసులు

జహీరాబాద్: రోడ్డు ప్రమాదాలు, ప్రమాద ఘటనల్లో ప్రాణాలు కాపాడటంలో సీపీఆర్ ప్రక్రియ ఎంతో కీలకంగా పని చేస్తుందని డీఎస్పీ వి.రఘు అన్నారు. మంగళవారం జహీరాబాద్‌లో సీపీఆర్ ప్రక్రియపై పోలీసులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర రోడ్ సేఫ్టీ ఆర్‌ఐ వి.ప్రతాప్, ఈఎంఆర్‌ఐ ప్రతినిధి జావేద్‌ల ఆధ్వర్యంలో సీపీఆర్(కార్డియో పుల్మనరీ రిససిటేషన్)పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోని ప్రమాదాలు, సంఘటనల సమయంలో మనిషి గుండె స్తంభించినప్పుడు, ఊపిరితిత్తుల్లో శ్వాస తీసుకోవడం సమస్యగా మారినప్పుడు వారి ప్రాణాలు కాపాడడం కోసం హృదయ, శ్వాసకోశ పునరుజ్జీవ చర్య చాలా కీలకంగా పనిచేసి స్తంభించిన గుండె తిరిగి పనిచేసే విధంగా సీపీఆర్ ఉపయోగపడుతుందన్నారు. అయితే సీపీఆర్ ప్రక్రియ ఏ రకంగా చేయాలనే విషయంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం కోసం స్టేట్ రోడ్ సేఫ్టీ, జీవీకే ఈఎంఆర్‌ఐలు సంయుక్తంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. పోలీసు సిబ్బంది అందరికీ సీపీఆర్ ప్రక్రియ పట్ల పూర్తి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ తోట భూపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వరాలయం ముస్తాబు


శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణం టోల్‌గేట్ సమీపంలోని శ్రీరామలింగేశ్వర స్వామి శ్రీరామ నవమి ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 30న శ్రీరామ నవమి. ఉదయం 3 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సుప్రభాత సేవ, సీతారాముల అభిషేకం, సర్వ అలంకరణ, సకల దేవతా హవనం, నవగ్రహ పూజ, 11 గంటల 40 నిమిషాలకు సీతారాముల కల్యాణం. అనంతరం అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు మహేశ్ మాట్లాడుతూ... ప్రతీ సంవత్సరం శ్రీరామనవమిని భక్తుల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర


జాతరలో పాల్గొన్న నీలం మధును సన్మానిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: జాతరలతో భక్తి భావం పెరుగుతాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు. మంగళవారం కర్దనూరులో శ్రీ భ్రమరాంభికా మల్లికార్జున స్వామి జాతర మహోత్సవానికి, బీరప్ప స్వామి కల్యాణానికి హాజరై ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు కర్దనూరు నుంచి దేవాలయం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం నీలం మధుకు క్రేన్ సహాయంతో గజమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఉప సర్పంచ్ పల్లె శ్రీశైలం, కుర్మ సంఘం అధ్యక్షుడు భూపాల్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, గోపాల్, మల్లేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన కునదొడ్డి దుర్గయ్య(42) మంగళవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని వారు తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర


ఉత్సవాల్లో పాల్గొన్న కాటా సుధా

జిన్నారం(పటాన్‌చెరు): వీరారెడ్డిపల్లిలో ఎల్లమ్మ తల్లి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి సన్నిధిలో అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాటా సుధా ఉత్సవాలకు హాజరయ్యారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన పూజలో పాల్గొన్నారు. అమ్మవారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

శ్రీ రామాలయంలో అభిషేకాలు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని శ్రీ రామాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సామూహిక అభిషేకాలు, సూర్యప్రభ వాహన సేవ, ప్రసాద వితరణ చేపట్టారు. అఖండ హరినామ సప్తహా మహోత్సవాల్లో భాగంగా గాథభజన, హరిజాగరణ, కాకడ హారతి, కరబ్ గజేంద్రభారతి మహరాజ్‌చే కీర్తన నిర్వహించారు.

పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బలరాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణ బీజేపీ ప్రధానకార్యదర్శిగా బలరాంను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నర్సింగ్ గౌడ్ మంగళవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో బలరాం మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

మునిపల్లి(అందోల్): పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దలోడి బస్వరాజ్‌పటేల్ సంబంధిత అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని పెద్దలోడి గ్రామంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పత్తి పంట క్వింటాల్‌కు రూ.7,400 ధర ఉండడంతో పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి పంటకు సుమారు రూ.15,350లు మద్దతు ధర ప్రకటించాలని ఆయన కోరారు.

తప్పిన పెనుప్రమాదం


పడిపోయిన విద్యుత్ స్తంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఐజీ కాలనీలో మంగళవారం ఓ భవనం కూల్చివేస్తుండగా విద్యుత్ స్తంభం కిందపడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో సుమారు నాలుగు స్తంభాలు ఒరిగి పోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా భవనం కూల్చివేయడంతోనే ఈ సంఘటన జరిగిందని స్థానికులు వాపోతున్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం భూపాల్‌రెడ్డి


మందిర నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): గిరిజనుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సిర్గాపూర్ మండలం తోల్యతండాలో భవానీ మాత మందిర నిర్మాణానికి దక్షిణ కాశీమాత ఆలయ పీఠాధిపతి జగదీశ్వర్ నంద్ మహరాజ్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించామన్నారు. ప్రతీ తండాలో సీసీ రోడ్లు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాఘవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, మందిరం పూజరి గణేశ్ మహరాజ్, తండా వాసులు హరినాయక్, గోవర్ధన్, విఠల్, రాంసింగ్ పాల్గొన్నారు.

బాలామృతం ప్యాకెట్లను గేదెలకు వేస్తున్నారు

సమావేశంలో సర్పంచ్ ఆరోపణ


మాట్లాడుతున్న బాలయ్య

జోగిపేట(అందోల్): అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే బాలామృతం ప్యాకెట్లను గేదెలకు వేస్తున్నారని కన్‌సాన్‌పల్లి సర్పంచ్ యాదాగౌడ్ ఆరోపించారు. ప్రభుత్వ కేంద్రాల్లో భోజనం, బాలామృతం ప్యాకెట్లను గేదెలకు పెట్టినట్లు రుజువైతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీడీపీఓ రేణుక హెచ్చరించారు. అందోల్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ సమావేశ మందిరంలో అధ్యక్షుడు బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో రైతులకు సంబంధించిన భూ సమస్యలపై చర్యలు తీసుకుంటున్నామని ఉప తహసీల్దార్ మధుకర్ రెడ్డి సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు సర్వేరిపోర్టు అందజేశామని మండల వ్యవసాయ అధికారి విజయరత్న తెలిపారు. మండలంలోని 7 గ్రామాలకు వైకుంఠ ధామాల్లో బోర్లు మంజూరయ్యాయని నీటిపారుదల శాఖ ఏఈ లక్ష్మి పసాద్ తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు మంజూరైన పనులను చేపట్టాలని ఏఈ మొగులయ్య సూచించారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. నేరడగుంట మీదుగా ఆర్టీసీ బస్సు మంతూరుకు ఉదయం, సాయంత్రం నడిపేవారని, ఇప్పుడు వయా డాకుర్ మీదుగా నడపడంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ఎంపీటీసీ కృష్ణాగౌడ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో అందోల్ జెడ్పీటీసీ రమేశ్, సర్పంచులు నరేందర్ రెడ్డి, పోచయ్య, లింగయ్య, సత్యనారాయణ, ఎంపీటీసీలు చిన్న జనార్దన్, ప్రమీల, సుజాత, ఎంపీడీఓ సూపరింటెండెంట్ అశోక్, ఏపీఓ అర్చన, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కి కార్యకర్తలే బలం

రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్


మాట్లాడుతున్న చింత ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్‌ఎస్‌కి కార్యకర్తలే బలం అని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం సైనికుల వలే పని చేయాలన్నారు. ప్రభుత్వం నిర్వహించిన అభివృద్ధి, అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సాధించుకున్న తెలంగాణలో మిషన్ భగీరథ పథకం, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, చేనేత, గీత, బీడీ కార్మికులకు ఫింఛన్, ఆహార భద్రత కార్డు ద్వారా ప్రతి ఒక్కరికీ 6కిలోల బియ్యం, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్టు, రైతుబంధు, 24 గంటల ఉచిత కరెంటు, సబ్సిడీపై ఎరువులు వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివకుమార్, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నరహరి రెడ్డి, సదాశివపేట చైర్ పర్సన్, వైస్ చైర్మన్ చింత గోపాల్, పులిమామిడి రాజు, ఆత్మకూర్ నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం


పోషకాహారం అందిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


కొండాపూర్(సంగారెడ్డి): సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): చిన్నారులకు పోషకాహారంతోనే ఆరోగ్యం చేకూరుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తల్లులకు సూచించారు. మంగళవారం సిర్గాపూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కిషన్ నాయక్ తండా పంచాయతీలో రూ. 25 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కల్హేర్ మండలం ఖానాపూర్(కె)లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంసింగ్, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాఘవరెడ్డి, సీడీపీఓ సుజాత, వైస్ ఎంపీపీ నారాయణ రెడ్డి, సర్పంచ్ జంగం స్వప్న, ఎంపీటీసీ పీరప్ప, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు మాధవరావు పాటిల్ పాల్గొన్నారు.

'ఎన్కేపల్లి'లో సామూహిక సీమంతం

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): ఎన్కేపల్లిలో పోషణ పక్షంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్ స్వరూప ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణీలకు సామూహిక సీమంతం నిర్వహించారు. చిరుధాన్యాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

కొండాపూర్(సంగారెడ్డి): పోషణ్ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా చెర్ల గోపులారంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ రత్నమాల, టీచర్ అనసూయ సీమంతానికి విచ్చేసి పోషకాహారం గురించి వివరించారు.

క్రషర్ నిర్వహణకు ప్రజాభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

కంది(సంగారెడ్డి): కంది మండల పరిధిలోని ఎర్దనూర్ తండా శివారులో నూతనంగా ఏర్పాటు చేయనున్న జిఐ ర్యాంక్ ఇండస్ట్రీ క్రషర్ నిర్వహణకు మంగళవారం ప్రజాభిప్రాయం నిర్వహించారు. దీనికి అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ గీత సమక్షంలో ప్రజాభిప్రాయాలను సేకరించారు. సర్పంచ్ రాందాస్ మాట్లాడుతూ ఆయాగ్రామాల్లో మౌలికసౌకర్యాల కల్పనకు కంపెనీ నిర్వాహకులు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ అధునాతన టెక్నాలజీని ఉపయోగించి బ్లాస్టింగ్ చేయాలని, దుమ్ము, ధూళి రాకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ క్రషర్ ఏర్పాటుకు సర్వేనంబర్ 259లో 42ఎకరాలభూమిని కేటాయించినట్లు తెలిపారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఆర్డీఓ నగేశ్, సీఐ శివలింగం, తహసీల్దార్ విజయలక్ష్మి, గిర్దావర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు మాతృవియోగం


అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, సర్పంచ్ ఓం ప్రకాశ్ పాటిల్ తల్లి కమలమ్మ పాటిల్ సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఎల్గోయి గ్రామంలోని వ్యవసాయక్షేత్రంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. దీనికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మైనార్టీ కమిషన్ సభ్యుడు మహ్మద్ తన్వీర్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సునితా పాటిల్, టీపీసీసీ సభ్యుడు నరోత్తం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావుపాటిల్, బీఆర్‌ఎస్ కార్యదర్శి నర్సింలు, పీఠాధిపతులు డా.సిద్దేశ్వర్‌స్వామి, శివాచార్య స్వామి హాజరై నివాళులు అర్పించారు.